క్లుప్తంగా

విద్యార్థులకు రాగిజావ

తాడూరు: మండలంలోని సిర్సవాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దాతల సహకారంతో ప్రతి రోజు రాగిజావ పంపిణీ చేస్తున్నట్లు జీహెచ్‌ఎం తిరుపతయ్య తెలిపారు. ఒంటిపూట పాఠశాలలు కావడంతో ఉదయం పాఠశాలకు విద్యార్థులు హాజరవుతున్న సందర్భంగా ప్రతి రోజు రాగిజావ అందించేందుకు ఏర్పాటు చేశామన్నారు.

పెద్దూరులో వైద్యశిబిరం

తెలకపల్లి: మండల పరిధిలోని పెద్దూరులో పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం 5వ రోజు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శివరాజ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎనిమిక్ వడదెబ్బకు గురైన వ్యక్తులు, చిన్నపిల్లలకు చికిత్సలో భాగంగా మందులు, సిరప్‌లు, సెలైన్ బాటిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సత్యనారాయణ, సుమలత, సరిత, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్‌లో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు కర్నె శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెబ్బేటి మల్లిఖార్జున్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున్ వారి తల్లిదండ్రుల పేరుమీద విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్‌లు, జామెట్రీ బ్యాక్స్, పెన్నులు అందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పెబ్బేటి విజయ, అధ్యాపకులు కృష్ణ, వెంకటస్వామి, రాజేందర్, కుసుమకుమారీ, లలిత, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కల్వకుర్తి టౌన్: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. పట్టణంలోని ఆరు కేంద్రాల్లో కలిపి 1,498 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 1348 మంది హాజరైనట్లు పరీక్షల సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్, బందోబస్తు నిర్వహించారు.

ప్రణాళికతో చదవాలి

తెలకపల్లి: ప్రణాళిక, ఏకాగ్రతతో చదివితే 10కి 10 జీపీఏ సాధించడం కష్టమేమి కాదని సైకాలజిస్టు శ్యాంప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సిద్దార్థ మాడల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, శ్రీనివాస్‌గౌడ్, కరస్పాండెంట్ విజయ్‌గౌడ్, ఉపాధ్యాయులు వెంకటయ్య, మల్లేశ్, రాము, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్‌లో మంగళవారం రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, ఎంపీటీసీ రంగారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు భాస్కర్‌రెడ్డి, నాయకులు రేణయ్య, వేణుగోపాల్‌రెడ్డి, లింగమయ్య, బాల్‌రెడ్డి, సైదలుగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు నర్సయ్య, నిరంజన్, బాలరాజు, శ్రీశైలం, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

చారకొండ: మండలంలోని జూపల్లిలో మంగళవారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రామస్వామి మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని ఏప్రిల్ 14 వరకు పూర్తి చేసి ప్రారంభిస్తామని అన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

కోడేరు: మండలంలోని రేకులపల్లితండా, ఒప్పితండా, శాగాపూర్ గ్రామాలకు కేఎల్‌ఐ బ్రిడ్జి నుంచి తిరుపతయ్య చెరువుకు ఆనుకొని ఉన్న రైతులకు సాగునీరు రాకపోవడంతో ఈ విషయం ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య యాదవ్, సర్పంచ్ లాల్‌సింగ్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై ఆయన స్పందించి సీడీపీ నిధుల నుంచి రూ.15లక్షల నిధులు మినీ లిఫ్టుకోసం నిధులు కేటాయించారు. దీంతో తండా వాసులు, ఆయా గ్రామాల ప్రజలు సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కొల్లాపూర్: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్న వారికి మంగళవారం పట్టణంలోని ఏపీజీవీబీ, డీసీసీబీలలో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఆయా బ్యాంకుల మేనేజర్లు, మున్సిపల్ కమిషనర్ రాజయ్య సమక్షంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఎస్‌బీఐ, సీబీఐ, యూనియన్ బ్యాంకుల్లో దరఖాస్తులు చేసుకున్న వారికి బుధవారం నూతన గ్రంథాలయ భవనంలో ఇంటర్వ్యూ జరుగుతాయని వెల్లడించారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి


మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి కాంక్షించారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో దళిత మహిళలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కుట్టుమిషన్లు, పీకో మిషన్లు పంపిణీ చేశారు. అలాగే నియోజకవర్గ పరిధిలో కులాంతర వివాహాలు చేసుకున్న వారికి సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా మంజూరైన ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే అందించారు. 6 మంది లబ్ధిదారులకు రూ.2.50లక్షల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు.

కొల్లాపూర్ రూరల్: గ్రామాల్లో నెలకొన్న లో ఓల్టేజీ సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తాళ్ల నరసింహపురంలో మీకోసం -మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్థానిక అధికారులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీరు, కరెంటు, పింఛన్, రోడ్లు, డ్రెయినేజీలకు సంబంధించిన సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే గ్రామానికి రూ.50 లక్షలతో సీసీరోడ్లు, సైడ్ కాల్వలు నిర్మించనున్నారు.

కొల్లాపూర్: వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని మిషన్‌భగీరథ స్కీం అధికారులకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మిషన్‌భగీరథ అధికారులతో సమావేశమయ్యారు. ఎల్లూరు పంపుహౌజ్ వద్ద నీటి లభ్యత, నీటి సరఫరా అంశాలపై ఎస్‌ఈ వెంకటరమణతో ఎమ్మెల్యే చర్చించారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ లెవెల్స్ తగ్గుతున్న క్రమంలో రెగ్యులర్‌గా నీటి నిల్వలు, సరఫరా అంశాలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఈలు అంజాద్‌పాష, రమేష్‌కుమార్, ఏఈ మల్లేశ్వర్‌రావులున్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు


దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ పాండునాయక్

అచ్చంపేట రూరల్: అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్డీఓ పాండునాయక్ అన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారుల వివరాలను సేకరించారు. ఎన్నేళ్లుగా స్థానికంగా ఉంటున్నారని, అద్దె ఇంటిలోనే ఉంటున్నారా..? లేదా సొంత ఇళ్లు ఉందా అని ఆరా తీశారు. పూర్తి వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామని తెలిపారు. ఆయన వెంట ఉప్పునుంతల ఆర్‌ఐ రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చీమర్ల అర్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట నరేశ్‌గౌడ్, పావని, భారతి, శ్రీశైలం, రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి


రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఈనెల 30న ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకురావడం గొప్ప విషయమని అన్నారు. రక్తం కొరతలేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వెల్దండ: ప్రజా సేవే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ముందుకెళ్తుందని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాచూర్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరనాగమ్మ ఆలయ నిర్మాణానికి రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదే విధంగా గ్రామానికి చెందిన రవికుమార్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఫౌండేషన్ సభ్యులు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, మల్లేష్‌ముదిరాజ్, రాములు, లక్ష్మయ్య, ఎల్లయ్య, గిరి, శంకర్, జయరాం, ప్రహ్లద్, వంశీ, వెంకటేష్, రమేష్‌నాయక్, కొండల్‌యాదవ్, వెంకటయ్య, మల్లయ్యముదిరాజ్, వెంకటయ్య ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

వెల్దండ: మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి, అల్లం తోట బావితండాలో మంగళవారం ఆ గ్రామ సర్పంచ్‌లు సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు కావడంతో గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో ఒక్కొక్క గ్రామ పంచాయతీలో రూ.10లక్షలతో సీసీరోడ్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చంద్రమ్మ, కుమార్, ఉపసర్పంచ్ శ్రీనునాయక్, నాయకులు కాడురామ్‌నాయక్, సోమయ్య, శంకర్‌నాయక్, హన్మంత్‌నాయక్, జహంగీర్, మల్లయ్య ఉన్నారు.

రైతులకు అవగాహన

అచ్చంపేట రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతు వేదికల్లో మంగళవారం రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. పంట పద్ధతులు, ఎరువుల వాడకం, పీఎం కిసాన్ ఈ కేవైసీ, దమ్ము చేయకుండా నేరుగా వరి విత్తడం పద్ధతులను ఏఓ కృష్ణయ్య, ఏఈఓలు వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో రక్తహీనత దూరం

వెల్దండ: మండల పరిధిలోని చెదురుపల్లిలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీమతి మాట్లాడుతూ కిశోర బాలికలు అంగన్‌వాడీ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదమ్మ, కార్యదర్శి శ్రీనివాసులు, అంగన్‌వాడీ టీచర్లు మరియమ్మ, విజయలక్ష్మీ ఉన్నారు.

ఆర్థికసాయం

వెల్దండ: మండల పరిధిలోని లింగారెడ్డిపల్లిలో ఇటీవల గుండెపోటుతో కొమ్ము కృష్ణయ్య మృతి చెందాడు. మంగళవారం మండల మాదిగల ఐక్య వేదిక అధ్యక్షుడు మీసాల అంజయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం పరంగా కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అనంతరం ఐక్యత వేదిక ఆధ్వర్యంలో రూ.10,500 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు సోమయ్య, జంగయ్య, శేఖర్, పుల్లయ్య, వెంకటయ్య, దేవయ్య, ప్రదీప్, దేవదాస్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యానికి మేలు


లింగాలలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

లింగాల: పోషకాహారం తీసుకుంటే రోగాల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉంటారని ఎంపీడీఓ గీతాంజలి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పోషణ పక్షోత్సవాల అమలులో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై మండల స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ పోషకాహారంపై పాఠశాల విద్యార్థులకు, తల్లులకు, బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గిరిజ, అమృత, భారతి, పోషణ అభియాన్ బీసీ పార్వతి పాల్గొన్నారు.

మన్ననూర్: పిల్లల్లో పౌష్టికాహార లోపం కనిపించకుండా ఉండేందుకు తమ వంతుగా నిరంతరం కృషి చేస్తున్నామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సువర్ణ, విజయమణెమ్మ అన్నారు. మంగళవారం మన్ననూర్‌లోని గిరిజన ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పోషక ఆహారాలు ఆరోగ్య పరిరక్షణ అంశంపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పోషణ లోపం లేకుండా చూసుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, సృజన, ఉపాధ్యాయులు చంద్రకళ, దేవి, అంగన్‌వాడీ టీచర్లు యశోద, రాణి, మంజుల పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై మినుములు

మన్ననూర్: జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వార మన్ననూర్ క్లస్టర్‌లోని 45 మంది రైతులకు వంద శాతం సబ్సిడీపై మినుములు అందజేశారు. మంగళవారం స్థానిక రైతువేదిక ప్రాంగణంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అమ్రాబాద్ ఏఓ సందీప్ పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ సీతారాం, ఐసీఐసీఐ ఫౌండేషన్ పెసిలిటేటర్ అంతయ్య, రైతులు శ్రీరాములు, కృష్ణయ్య, చంద్రయ్య, ముక్తికళ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన జేఎల్ లక్ష్మికి కలెక్టర్ సన్మానం

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లెక్చరర్ తిప్పర్తి లక్ష్మి డాక్టరేట్ పొందింది. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మంగళవారం ఆమెకు శాలువాతో సన్మానించారు.

ఫేక్‌అకౌంట్ క్రియేట్.. యువకుడిపై దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: ఇన్‌స్టాగామ్‌లో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి చాటింగ్ చేస్తున్నాడనే అనుమానంతో యువకుడిపై దాడికి పాల్పడిన సంఘటన చోటుచేసుకోగా మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. జిల్లాకేంద్రానికి చెందిన రాజేష్, పవన్ ఇన్‌స్టాగామ్‌లో అమ్మాయి ఫోటోతో ఉన్న ఫ్రెండ్ రిక్వెస్ట్ రావడంతో యాక్సెప్ట్ చేసి తరుచూ చాటింగ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన అరవింద్ ఇన్‌స్టాగామ్‌లో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి తమతో చాటింగ్ చేస్తున్నాడనే అనుమానంతో అతడిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో రాజేష్, పవన్‌లపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ వెల్లడించారు.

కంటివెలుగు పరీక్షలు

కల్వకుర్తిరూరల్: అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మనోహర చెప్పారు. మండలంలోని జంగారెడ్డిపల్లిలో మంగళవారం కంటి వెలుగు శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న లింగారెడ్డి, ఎంపీడీఓ ఆంజనేయులు, ఏపీఓ చంద్రసిద్ధార్థ్, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, లింగారెడ్డి, మాజీ డైరెక్టర్ తిరుపతయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం

చారకొండ: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు అమలులో ప్రగతి సాధించిన మండలంలోని 17 గ్రామాలకు పంచాయతీ పురస్కార్ అవార్డులు వచ్చాయి. ఈ మేరకు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేతులమీదుగా సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, ఎంపీడీఓ జయసుధ, ఎంపీఓ నారాయణ ఉన్నారు.

ఘనంగా సుంకులమ్మ బోనాలు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరంలో సుంకలమ్మ బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనం ఎత్తి ఆటలు, పాటలు పాడుతూ బొడ్డెమ్మలు కొడుతూ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ మేరకు బండ్లలాగుడు పోటీల్లో విజేతలకు సర్పంచ్ తిరుపాటి నాగరాజు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, నర్సింహనాయుడు, బాలరాజు, రాజు, రామచందర్, రాముడు, కురుమయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి ప్రత్యేక హోదాకు కృషి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం పురాతనమైందని, ప్రత్యేక హోదా కల్పిస్తూ టీటీడీ, దేవాదాయ శాఖ నుంచిఅభివృద్ధి కోసం సహకరిస్తామని దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సూపరిండెంట్ రఘునందన్ అన్నారు. మంగళవారం ఆలయాన్ని, ఆలయంలోని విగ్రహాలు, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు వెంకటేశ్వరి, ఈఓలు రంగాచారి, కవిత, ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగాచారి, మధు, వీరాచారి, నరేష్, మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ

కోడేరు: మండలంలోని ఎత్తం గ్రామానికి సినీ డైరెక్టర్ రాఘవేందర్‌రావు సర్కార్ నౌకరి సినిమా చిత్రీకరణకు వచ్చారు. అయితే సినిమా షూటింగ్‌లో విద్యార్థుల ర్యాలీ ఉండటంతో వారికి బూట్లు లేకపోవడంతో ఆయన స్పందించి 270మంది విద్యార్థులకు బూట్లు అందించారు. ఈ మేరకు మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు నిర్మల పంపిణీ చేశారు. అనంతరం డైరెక్టర్ రాఘవేందర్‌రావుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పబ్లిక్ టాయిలెట్లను ప్రారంభించాలి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని కొత్తబస్టాండ్ దగ్గర నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లు, మూత్రశాలలు ప్రారంభించాలని దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు కోరారు. మహిళలు, వృద్ధులు, ప్రయాణికులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున పబ్లిక్ టాయిలెట్లను ప్రారంభించి ఇబ్బందులు తొలగించాలని ఆయన కోరారు.

స్వచ్ఛ భారత్ మిషన్‌పై శిక్షణ


శిక్షణలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు

అమ్రాబాద్: అమ్రాబాద్, పదర మండల్లాలోని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ప్రారంభమైంది. ఆయా గ్రామ పంచాయతీల్లో ఓడీఎఫ్‌ను అమలుపర్చడానికి పీపీటీ రూపంలో స్వచ్ఛ భారత్ మిషన్ ట్రైనర్స్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీఓలు రామ్మోహన్, శంకర్‌నాయక్, అమ్రాబాద్ మండల పంచాయతీ అధికారి వెంకటయ్య, జిల్లా ఎస్‌బీఎం శిక్షకులు ఊషన్న, ఫారుక్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


గుట్టలపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ గంగామోహన్

తాడూరు: పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీడీఓ గంగామోహన్‌తోపాటు పలువురు అధికారులు మంగళవారం పొల్మూరు, గుట్టలపల్లి గ్రామాలను సందర్శించారు. ఉత్తమ అవార్డులకు గ్రామాలు ఎంపికైన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు నారయ్య, జానకమ్మలకు వివరించారు. అనంతరం ఉపాధి కూలీల సంఖ్య పెంచి ప్రతి రోజు వందమంది కూలీలు పాల్గొనే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీల నుంచి వచ్చే వివిధ రకాల పనులను వంద శాతం వసూలు చేయాలని కార్యదర్శులకు వివరించారు.

ముస్లింలకు రంజాన్ సరుకులు


ప్రార్థన చేస్తున్న ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు

అచ్చంపేట రూరల్: రంజాన్ పవిత్ర మాసంలో సరిపడా నిత్యావసర సరుకులను మంగళవారం అచ్చంపేటలో జుబేదా ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు అందించారు. 11ఏళ్లుగా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు బియ్యం, గోధుమపిండి, కందిపప్పు, శనగపప్పు, చక్కెర, అల్లం, ఉల్లిగడ్డ, చింతపండు, ఇతర నిత్యావసర ఆహార పదార్థాలను అందిస్తున్నామన్నారు. మంగళవారం 250 మందికి సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ఫౌండర్ వాజీద్, మజీద్ కమిటి సదర్, సభ్యులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి


సీసీ నిరంజన్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న వీఓఏలు

తెలకపల్లి: ఐకేపీలో వీఓఏలుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల నాయకురాలు చంద్రకళ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయంలో పనిచేస్తున్న వీఓఏలు కార్యాలయ సీసీ నిరంజన్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు కార్యాలయంలో ఆన్‌లైన్ పనులను విరమించి సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీసీ నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షురాలు నీలమ్మ, నాగలక్ష్మీ, ఖాజాజి, వీఓఏలు పర్వత్‌భేగం, అరుంధతి, నాగలక్ష్మి, ఉమ, మహాలక్ష్మి, సుధ, భాగ్య, హరిత పాల్గొన్నారు.

యంగంపల్లితండాలో ఎక్సైజ్ అధికారుల దాడులు


సీజ్ చేసిన సారా

పెంట్లవెల్లి: మండల పరిధిలోని యంగంపల్లితండాలో బుధవారం ఎక్సైజ్ అధికారులు సీఐ ఏడుకొండలు, ఎస్‌ఐ శంకర్ ఆధ్వర్యంలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ మేరకు 900 లీటర్ల సారా ఊట డ్రమ్‌లలో నిల్వ ఉంచగా వాటిని నేలమట్టం చేశారు. అదేవిధంగా 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే కాంగ్రెస్ జోడో యాత్ర


సమస్యలు తెలుసుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

బల్మూర్: ప్రజా సమస్యల పరిష్కారానికే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రతో గడపగడపకు తిరుగుతున్నామని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని బిల్లకల్‌లో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చేపట్టిన సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీపతిరావు, జిల్లా నాయకులు సుధాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు విష్ణు, జంగయ్య, నర్సింగ్‌రావు, రాంప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

వెల్దండ: కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాధారణ చూసి బీజేపీ ప్రభుత్వం ఓర్వలేక రాహుల్ గాంధీని సస్పెండ్ చేయించారని పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలను ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని నిరసన దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, జగన్, మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, శ్రీకాంత్ రెడ్డి, పర్వత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జోగయ్య, చంద్రమోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రషీద్, హమీద్, పుల్లయ్య, శేఖర్, శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

నేటినుంచి శ్రీరామగట్టు జాతర

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి సమీపంలో ఉన్న శ్రీరామ గట్టుపై ఈనెల 29వ తేదీన బుధవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ చిలువేరు వెంకటయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న అమ్మవారికి నైవేద్యాల సమర్పణ, ఈనెల 30న సీతారామ కల్యాణ మహోత్సవం, 31వ తేదీన రథోత్సవం, ఏప్రిల్ 1వ తేదీన అమ్మవారికి నైవేద్యం సమర్పణ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని తెలిపారు.